పోటెత్తిన పట్టభద్రులు.. ఓటేసిన టీచర్లు


ఓటర్లను పలకరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్


బల్లికురవ: పోలింగ్ గురించి స్థానిక నేతలతో అడిగి వివరాలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య


ఇంకొల్లు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ వకుల్ జిందాల్


చినగంజాం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- బారులు తీరిన పట్టభద్రులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

అద్దంకి/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: తూర్పు రాయలసీమ, చిత్తూరు నెల్లూరు ఉమ్మడి ప్రకాశం జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా కూడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసు యంత్రాంగం, అధికారులు మొత్తం ఊపిరి పీల్చుకున్నారు. ఈఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. వికలాంగులు, చంటిబిడ్డలను తీసుకువచ్చి మరీ ఓటు వేశారు. సాయంత్రం నాలుగు గంటల్లోపు క్యూల్లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 87 నుంచి 91, 102 నుంచి 104 వరకు ఉన్న 8 పోలింగ్ బూత్‌లలో 8,721 మంది పట్టభద్రులకు, 41 నుంచి 43, 48,49 పోలింగ్ బూత్‌ల్లో 604 మంది ఉపాధ్యాయ ఓటర్లకు ఎన్నికలు జరిగాయి.

అద్దంకి పట్టణంతోపాటు, రూరల్ పరిధిలోని 3,617 మంది ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 87, 88, 89 బూత్‌ల్లో పట్టభద్రులు, 41 బూత్‌లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని బాపట్ల జిల్లా ఏఎస్పీ మహేశ్, ప్రిసైడింగ్ అధికారి జీవీ సుబ్బారెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ టీ రవి కుమార్, సీఐ రోశయ్య, ఎస్సైలు ఆదిలక్ష్మి, ప్రవీణ, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య శాఖ తరుపున ఏఎన్‌ఎంలు శిబిరాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల్లో 3,617 మందికి 2726 మంది ఓటు హక్కును వినియోగించుకుని 75.37 శాతం నమోదు చేశారు. అత్యధికంగా 353 మంది ఉపాధ్యాయలకు 337 మంది ఓటు హక్కును వినియోగించుకుని 95.47 శాతం నమోదు చేశారు.

✎ బల్లికురవలో 1174 మంది పట్టభద్రుల్లో 873 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు మొత్తం 32 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సై వీ వేమన, ఎన్నికల అధికారులు తహసీల్దార్ పీ సీతారత్నం, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య బల్లికురవ, అద్దంకి, జే పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరులో స్థానిక నేతలను కలుసుకుని పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

✎ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల ఎంపీపీ స్కూల్ నందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. 98 ఉపాధ్యాయ ఓట్లలో 92, 1338 పట్టభద్రుల ఓట్లలో 1017 మంది వినియోగించుకున్నారని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. మేదరమెట్ల ఎస్సై శివకుమార్ పోలింగ్ స్టేషన్ వద్దనే పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

✎ సంతమాగులూరు మండలంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 1139 ఉండగా 890 మంది, 63 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 63 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రిసైడింగ్, తహసీల్దార్ అశోక్ వర్ధన్, ఎంపీడీవో సాంబశివ రావు, ఎస్సై నాగ శివారెడ్డి పర్యవేక్షించారు.

✎ జే.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. 58 ఉపాధ్యాయ ఓట్లకు గాను 56 ఓట్లు నమోదయ్యాయి. 1488 పట్టభద్రుల ఓట్లకు 1186 ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు.

ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు..

పర్చూరు/చినగంజాం/కారంచేడు/మార్టూరు/యద్దనపూడి: నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎనికల్లో ఓటు హక్కు వినియోగించేందుకు ఓటర్లు బారులు తీరారు. పర్చూరు మండలంలో స్థానిక యూపీ స్కూల్‌లో పట్టభద్రుల్లో మొత్తం 1190 ఉండగా 902 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు ఏర్పాటు చేయగా మొత్తం 79 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 74 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన 110 పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో మొత్తం 350 మంది ఓటర్లలో 279 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


జే.పంగులూరులో దివ్యాంగుడిని ఓటు వేయించి తీసుకొస్తున్న పోలీసు


చినగంజాం: దివ్యాంగుడిని ఓటు వేయించి తీసుకువస్తున్న హోంగార్డు

పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో రవీందర్ పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్సై ఎన్.సి.ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఏఈఆర్వో నెహ్రూబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

✎ కారంచేడు మండల కేంద్రం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘనటలు జరగకుండా ఎస్సై ఎం అనిత ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయ ఓట్లల్లో 50కు గాను 46 ఓట్లు పోలవ్వగా, పట్టభద్రుల ఓట్లలో మొత్తం 896కు గాను 679 ఓట్లు పోలయ్యాయి. ఎంపీడీవో రమేష్ బాబు, తహసీల్దారు ఎస్ వెంకటరత్నం తన సిబ్బందితో కలసి ఎన్నికలను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జెస్సీరాణి వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంప్ నిర్వహించారు.

✎ యద్దనపూడి మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు 759గాను 601 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లలో 27 ఓట్లుకు గాను 24 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 80 శాతం పోలింగ్ నమోదయినట్లు ప్రిసైడింగ్ అధికారులు పీ సుధారాణి, ఆర్ శరత్‌లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై రత్న కుమారి, తహసీల్దార్ వెంకటరెడ్డిలు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

✎ చినగంజాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి గ్రాడ్యుయట్ల ఓట్లు 859 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 80 శాతం ఓట్లు నమోదైనట్లు ప్రిసైడింగ్ అధికారి కేవీఎస్ మల్లికార్జునరావు తెలిపారు. 23 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రిసైడింగ్ అధికారి ఎంఎల్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కట్టా అనూక్ ఆధ్వర్యంలో 20 మంది పోలీసులు, 10 మంది మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

✎ మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 107 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్ ఇతర సిబ్బందితో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు శాంతి భద్రతలు పరిరక్షించారు. బాపట్ల ఆర్డీవో జీ రవీందర్, బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు మొత్తం 151 ఓట్లకు గాను 144, మొత్తం 2254 పట్టభద్రుల ఓట్లకు గాను 1534 ఓట్లు పోలయ్యాయని అధికారులు చెప్పారు.

✎ ఇంకొల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 1231 కాగా 947 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓట్లు మొత్తం 102 ఓట్లు కాగా 99 ఓట్లు పోలయ్యాయి. ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

✎ ఇంకొల్లు పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సందర్శించి పరిశీలించి జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఎస్పీ పీ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ జిందాల్..

వేటపాలెం/చీరాల: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. వేటపాలెం మండల పరిధిలో ఎన్నికల బూత్‌లను జిల్లా కలెక్టర్ కే విజయకృష్ణన్, ఆర్‌డీఓ పి సరోజినీ, ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. మొత్తం పట్టభద్రుల ఓటర్లు 2,676 ఉండగా 1934 మంది, ఉపాధ్యాయ ఓటర్లలో 248 మందికి గాను 238 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్డీవో సరోజినీ వేటపాలెంలోని 100 నెంబర్ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

✎ చీరాల పట్టణం, గ్రామాల్లో ఉపాధ్యాయ ఓటర్లు 505 మందికి ఓటు హక్కు ఉండగా 458 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 90.69 శాతం నమోదైంది. పట్టభద్రుల ఓటర్లు 7412 మందికి గాను 5206 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ 70.24 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ జిందాల్, ఆర్డీవో సరోజిని పరిశీలించారు.


అద్దంకి: పోలింగ్ స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేశ్


కారంచేడులో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్


వేటపాలెంలో పోలింగ్ బూత్‌ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ సరోజిని


యద్దనపూడిలో వృద్ధుడిని తీసుకెళ్తున్న రెవెన్యూ సిబ్బంది


మార్టూరులో బారులు తీరిన ఓటర్లు


అద్దంకి: నాలుగు గంటల తరువాత బారులు తీరిన ఓటర్లు


మేదరమెట్లలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



చీరాల: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్


పర్చూరు: క్యూలో ఉన్న ఓటర్లు

క్లుప్తంగా

ఘనంగా శ్రీరామకోటి పట్టాభిషేక మహోత్సవం


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమంచి

చినగంజాం: పెదగంజాం పురాతన భావన్నారాయణస్వామి దేవాలయంలో సోమవారం రామకోటి 17వ వార్షికోత్సవ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. భావన్నారాయణ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది రామకోటి పుస్తకాలను భక్తులు లిఖించి వాటిని శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ పట్టాభిషేకం, సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చినగంజాం: మండలంలోని మున్నంవారి పాలెం గ్రామంలో పోలేరమ్మ దేవత నూతన గుడి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజారుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా గ్రామ కాపులు మున్నం శంకరరెడ్డి, కోకి శ్రీనివాసరెడ్డి, ఆసోది శ్రీనివాసరెడ్డి, నారపరెడ్డి, ఆట్ల అంకిరెడ్డి, సూరిన రంగారెడ్డి, నిదర సాంబిరెడ్డి, దైవాల రమణారెడ్డి, అక్కల శ్రీను, పలపట్ల కోటేశ్వరరెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు.

ఒక్క మాత్రతో చిన్నారులకు ఆరోగ్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రభాకరరావు

వేటపాలెం: చిన్నారులకు అల్బెండజోల్ ఒక్క మాత్రతో వారి ఆరోగ్యాన్ని కాపాడదామని వైద్యాధికారి ఎం ప్రభాకర్‌రావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బుధవారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ స్కూళ్లలో చిన్నారులకు నులుపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. రెండేళ్ల వయసు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మాత్రలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గురవమ్మ, ఎంపీ హెచ్‌ఓ సిహెచ్ శేషుబాబు, పీహెచ్‌ఎన్ మేరీభూషణం, పిచ్చయ్య పాల్గొన్నారు.

విజయం వైఎస్సార్ సీపీదే

చీరాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదేనని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం చీరాల, వేటపాలెం మండలాల్లో జరుగతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మీడియాతో వెంకటేష్ మాట్లాడుతూ గతంలో 30 శాతం కూడా నమోదుకాని పరిస్థితుల్లో ఈసారి అత్యధికంగా ఓటింగ్ నమోదైందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల్లో చైతన్యం పెరగడంతో పాటు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులతో యువత సీఎంకు అండగా నిలిచి ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో వచ్చే 30 ఏళ్ల వరకు సీఎంగా జగన్‌కు తిరుగులేదని, రాన్నున్న ఎన్నికలకు రిఫరెండంగా ఇవి సూచికగా పనిచేస్తాన్నాయన్నారు. పట్టభద్రుడి ఓటరుగా ఒంగోలులో నమోదైన కరణం వెంకటేష్ ఒంగోలులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయంతో పాటు అధిక మెజార్టీ చీరాల నుంచే వస్తుందని దాయన ధీమా వ్యక్తం చేశారు.

దాతల సహకారం అభినందనీయం

పుల్లలచెరువు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 48 మంది విద్యార్థినులకు ఇక్కడి జెడ్పీ హైస్కూల్ 2004 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ప్యాడ్స్, పెన్నులను ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. ఽ

కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలి

కారంచేడు: అన్నదాల సంక్షేమం కోసం సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పంతో గ్రామాల్లోను ఏర్పాటు చేస్తున్న శనగల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిపూడి సొసైటీ అధ్యక్షుడు యర్రం లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని యర్రంవారిపాలెంలో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మార్కెట్ ధరల కంటే కూడా ఎక్కువగా రైతులను మేలు జరిగేలా మంచి గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేస్తుందన్నారు. మార్కెట్ ధర కేవలం రూ.4500 ఉంటే, ప్రభుత్వ గిట్టుబాటు ధర రూ.5338 ఉందన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ రీజినల్ బ్యాంక్ డీజీఎం వై ప్రకాష్, మేనేజర్ ఎం విశ్వేశ్వరరావు, పర్చూరు పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ప్రసూనాంబ, ఫీల్డు ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆదిపూడి గ్రామసర్పంచ్ ఎన్ నాగరాజు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ముగిసిన సాయి మందిరం వార్షికోత్సవాలు


సాయినాథుని విగ్రహం వద్ద నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్ ఆవరణలోని సాయినాథుని ధ్యాన మందిరం వార్షికోత్సవాలు ఈ నెల 11న ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. సాయిపథం షిర్డీ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించగా, ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హాజరయ్యారు. మూడు రోజులపాటు నిరంతరాయంగా సాయినామ పారాయణతో పాటు సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగ సంభాషణలను ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా గురు బంధువులు ఆలకించేందుకు, వీక్షించేందుకు చేపట్టిన చర్యలు ప్రశంసలు అందుకున్నాయి. సాయిబాబా జీవిత విశేషాలపై ప్రత్యేకంగా కూర్చిన సాయి క్విజ్ కార్యక్రమంలో భక్తులు అనుసంధానం కావడానికి గల వివిధ మార్గాలను గురు బంధువులు అందరూ సమావేశమై సమీక్షించుకున్నారు. చిన్నారులకు సాయిబాబా చిత్రాల డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

366 పొగాకు బేళ్ల అమ్మకాలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం -2లో సోమవారం 366 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మొత్తం 487 బేళ్లను అమ్మకానికి ఉంచగా, వాటిలో 73 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కేజీ అత్యధిక ధర రూ.200 పలకగా, అత్యల్ప ధర రూ.195, సరాసరి ధర రూ.197.77 నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి



దర్శి: శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం జరిగే తిరునాళ్ల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందు రోజే భక్తులు తలంటు స్నానాలు చేసి స్వామి వారికి పొంగళ్లు నివేదన చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి తిరునాళ్లకు భక్తులు భారీగా హాజరవుతారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి.. మొల్లమాంబ


నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: రామాయణాన్ని తెలుగులో అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని శాలివాహన సంఘ నాయకుడు మధుసూదనరావు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మొల్లమాంబ 583వ జయంతి సందర్భంగా పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు జనార్దన్, దగ్గుపాటి రమణ, అంకన్న, అద్దంకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏరో డ్రోన్ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు


డ్రోన్ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

మేదరమెట్ల: ఏరోడ్రోన్ సాంకేతికతతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో డ్రోన్ టెక్నాలజీతో పురుగు మందులు పిచికారీ విధానంపై డెమో ప్రదర్శించారు. గ్రామానికి చెందిన రైతు కారుసాల శేషతల్పసాయి సుమారు రూ.3.50 లక్షల విలువైన డ్రోన్ కొనుగోలు చేయగా.. కంపెనీ ప్రతినిధులు డ్రోన్ సాయంతో పురుగుమందులు ఏ విధంగా చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో వస్తున్న టెక్నాలజీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రావినూతల రైతులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, కమల్ నితీష్, శ్రీనివాసరావు, తేజ పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

కొనకనమిట్ల: స్థానిక శివాలయంలో సోమవారం ప్రజలు వేడుకగా శివ పార్వతుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వేదపండితుల పర్యవేక్షణలో ముందుగా పార్వతి, పరమేశ్వరులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు పాల్గొని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి కల్యాణం జరిపించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి సంగమేశ్వర, పార్వతీదేవి, వినాయకస్వామి, నందీశ్వరులకు పూజలు చేశారు. నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేసి శాంతి పూజలు జరిపించుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com